వేధించిన వారిని వదలం

ప్రభుత్వ విప్ కాలవ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

కణేకల్లు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అధికార మదంతో గత ఐదేళ్లలో టీడీపీ శ్రేణులను వేధించిన వైసీపీ నాయకులెవ్వరినీ వదలమని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఉద్ఘాటించారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ కాలవ మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు.. టీడీపీ శ్రేణులపై వేధింపులకు పాల్పడడంతోపాటు అక్రమ కేసులు బనాయించి, దాడులు చేశారన్నారు. వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదలమని స్పష్టం చేశారు. పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో హెచ్చెల్సీ అభివృద్ధికి రూపాయి కూడా నిధులు వెచ్చించలేదనీ, తాము అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే రూ.35 కోట్లతో లైనింగ్, కల్వర్టుల నిర్మాణం తదితర పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి, టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, ఆది, వేలూరు మరియప్ప, కోళకుర్తి సుదర్శన్, బీటీ రమేష్, వన్నారెడ్డి పాల్గొన్నారు.

వామ్మో.. చిరుత

కంబదూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఓబయ్య తోట సమీపాన గల గ్రానైట్ కొండలో బుధవారం చిరుత కనిపించడంతో చుట్టుపక్కల రైతులు భయాందోళనకు లోనయ్యారు. బుధవారం ఉదయమే సమీపంలోని ఓ తోటలో రైతు వెంకటేశులుకు చెందిన మేకను చిరుతను చంపేసి, కొండపైకి వెళ్తోంది. ఆ గ్రానైట్ కొండ వద్ద పనిచేస్తున్న కూలీలు, రైతులు గమనించి వీడియో తీసి, అటవీ శాఖాధికారులకు పంపిచారు. రాత్రి సమయాల్లో తోటల్లోకి వెళ్లాలంటే రైతులు జంకుతున్నారు. అటవీశాఖాధికారులు.. చిరుతను బంధించాలని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.




కంబదూరు సమీపంలోని ఓబయ్య తోట వద్ద గ్రానైట్ కొండలో సంచరిస్తున్న చిరుత

- వసూళ్లు పట్టని రెవెన్యూ అధికారులు
- కొంతమంది చేసినా.. సొంతానికి వాడుకున్నట్లు ఆరోపణలు
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- హెచ్చెల్సీ మరమ్మతులపై ప్రభావం

హెచ్చెల్సీ



నీటి తీరువాపై నిర్లక్ష్యం..!



బొమ్మనహాళ్ మండలంలో నీటి తీరువా వసూలు చేయడంలో ఆరేళ్లుగా నిర్లక్ష్యం చేస్తున్నారు. భూమిశిస్తు రూపంలో నీటి తీరువా ఏటా సక్రమంగా వసూలు చేయడం ద్వారా రైతులకు సాగునీటి పంపిణీకి వెసులుబాటు ఉంటుంది. నీటి తీరువా మొత్తాన్ని రైతు ప్రయోజనాలకు ప్రభుత్వం వినియోగిస్తుంది. ప్రస్తుతం నీటి తీరువా వసూళ్లు పడకేయడంతో ప్రయోజనాలకు విఘాతం కలుగుతోంది.



హెచ్చెల్సీ ఆయకట్టులో సాగుచేసిన వరి

బొమ్మనహాళ్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం.. కాలువల మరమ్మతులకు నీటితీరువా నిధులను కేటాయిస్తుంది. గత వైసీపీ ప్రభుత్వం పైసా కూడా నిధులు విదల్చలేదు. కాలువలకు అత్యవసర మరమ్మతులు కూడా చేపట్టలేదు. ఆ ప్రభావం గడిచిన ఖరీఫ్‌లో కనిపించింది. గతంలో భారీ వర్షాలకు పంటలు నీటమునిగి రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ఏటా కాలువలో మరమ్మతులు చేస్తే అధిక వర్షాలు కురిసినా సమస్యలు తలెత్తవు. తుంగభద్ర జలాశయంలో ఆశించిన స్థాయిలో నీరు ఉన్నప్పటికీ కాలువ అధ్వాన్న స్థితికి చేరుకోవడంతో తీసుకోలేని దుస్థితి దాపురించింది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నీటి పారుదల శాఖలోని ఎగువ కాలువతో పాటు డిస్ట్రిబ్యూటరీలు అధ్వానంగా తయారయ్యాయి. నీటి తీరువా సక్రమంగా వసూలు చేస్తే ప్రభుత్వం వద్ద నిధులు అందుబాటులో ఉంటాయి. కాలువల మరమ్మతులకు మంజూరు చేసే వెసులుబాటు ఉంటుంది. రైతుల నుంచి వసూలు చేసిన నీటి తీరువా మొత్తంలో 70 శాతం కాలువల మరమ్మతుల కోసం ప్రభుత్వం మంజూరు చేస్తుంది. హెచ్చెల్సీ ఆయకట్టులో ఏడాదికి ఎకరాకు రూ.200 నీటి తీరువా వసూలు చేయాలి. చెరువు కింద ఉన్న ఆయకట్టుకు రూ.350 వసూలు చేసే బాధ్యత రెవెన్యూ శాఖదే. మండలంలోని హెచ్చెల్సీ ఆయకట్టులో 18,557 ఎకరాలు సాగు చేస్తున్నారు. దీంతో ఏడాదికి రూ.37 లక్షలకుపైగా పన్ను రూపంలో ఆదాయం వస్తుంది. దీంతో 15 వేల ఎకరాలకుపైగా వరిసాగు చేస్తున్నారు. దానిమ్మ, మిరప, బొప్పాయి, ఉద్యాన పంటలు కూడా పండిస్తున్నారు. శ్రీధరఘట్ట చెరువు పరిధిలో 218 ఎకరాలకుపైగా ఉంది. ఏడాదికి రూ.76 వేలకుపైగా ఆదాయం లభిస్తుంది. ఆరేళ్లుగా నీటి తీరువా వసూళ్లను పూర్తిగా విస్మరించారు. దీంతో బకాయిలు పేరుకుపోతున్నాయి. ఒకేసారి అంత మొత్తం రైతుల నుంచి వసూలు చేయడం కష్టమవుతోంది. ఆరేళ్లుగా నీటి తీరువా రూ.నాలుగు కోట్ల మేర రావాల్సి ఉంది. గత ప్రభుత్వంలో ఐదేళ్లలో ఎంత వసూలు చేశారన్నది స్పష్టత లేదు. రెండేళ్ల నుంచి రూ.రెండుకోట్లు వసూలు చేయాలని గణాంకాలు బయటకు వస్తున్నాయి. రెవెన్యూ శాఖ.. దీనిపై దృష్టి సారిస్తే వేసవి పనులకు నిధుల కొరత ఉండదు.

హెచ్చెల్సీని గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. కొత్త ప్రభుత్వం రూ.37 కోట్లతో పనులు చేపట్టనుంది. ఆ మేరకు నిధులు మంజూరు చేసింది. బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లోని దర్గాహోన్నూరు, ఉద్దేహాళ్, మీనహళ్లి, కణేకల్లు వద్ద రెగ్యులేటర్, వంతెనలు, కాలువ పనులు చేపట్టనున్నారు. నిధులు మంజూరు చేయడంతో అధికారులు కాంట్రాక్టర్ల ద్వారా టెండర్లు వేసి పనులు ప్రారంభించారు. మరిన్ని పనులు చేసేందుకు వేసవిలో ప్రభుత్వంపై భారం లేకుండా ఉండాలంటే రెవెన్యూశాఖ నీటి తీరువా సకాలంలో వసూలు చేయాల్సి ఉంది. ఆ దిశగా శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.37 కోట్లు మంజూరు

కొరవడిన పర్యవేక్షణ

నీటితీరువా వసూళ్లపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడిందన్నది బహిరంగ రహస్యమే. దీంతో సిబ్బంది ఏ మాత్రం చేస్తున్నారో తెలియడం లేదు. రైతుల నుంచి కొంతమంది సిబ్బంది నీటితీరువా వసూలు చేసి, సొంతానికి వాడుకున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. కొందరు రైతులకు రసీదులు కూడా ఇచ్చినట్లు సమాచారం. రెవెన్యూశాఖ.. వసూళ్లపై ఉన్నతాధికారుల దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

నీటితీరువా వసూలుకు ఆదేశాలిచ్చాం

బొమ్మనహాళ్ మండలంలోని హెచ్చెల్సీ, శ్రీధరఘట్ట చెరువు ఆయకట్టు భూములకు సంబంధించి నీటి తీరువా వసూలు చేయాలని ఇప్పటికే వీఆర్వోలకు ఆదేశాలిచ్చాం. హెచ్చెల్సీ ఆయకట్టు పరిధిలో తరిపంట ఎకరాకు రూ.200, ఆరుతడి పంట భూములైతే ఎకరాకు రూ.100 ప్రకారం వసూలు చేస్తారు. శ్రీధరఘట్ట చెరువు భూములకు ఎకరాకు రూ.350 ప్రకారం వసూలు చేస్తాం.



- మునివేలు, తహసీల్దార్, బొమ్మనహాళ్

కలెక్టర్, ఉన్నతాధికారుల పేర్లతో

నకిలీ అకౌంట్లు

వసూళ్లకు పాల్పడుతున్న ఆగంతకులు.. అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్



అనంతపురం టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కలెక్టర్, ఉన్నతాధికారుల పేర్ల మీద సోషల్ మీడియాలో నకిలీ అకౌంట్లు సృష్టించి కొందరు ఆగంతకులు డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారు. అలాంటి వారిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రజలు, సహచర ఉద్యోగులకు కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ఈ మేరకు కలెక్టర్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తన పేరుతో పాటు కొంతమంది ఉన్నతాధికారుల పేర్ల మీద నకిలీ అకౌంట్లు సృష్టించి డబ్బులు అడుగుతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. జిల్లాలో ఒక మున్సిపల్ కమిషనర్, ఒక తహసీల్దారును ఇలాగే ఉన్నతాధికారుల అకౌంట్ల పేరుతో డబ్బులు కావాలని అడిగారని పేర్కొన్నారు. ఇలాంటి నకిలీ అకౌంట్లను నమ్మి మోసపోవద్దని తెలిపారు. అవసరమైతే ఫోన్లలో మాట్లాడి వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. ఎవరికైనా సోషల్‌మీడియాలో నకిలీ అకౌంట్ల నుంచి డబ్బులు పంపాలని మెసేజ్‌లు వస్తే వెంటనే సమీపంలో ఉన్న పోలీసులకు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

హాయ్ అంటే.. హాయిగా..!

వాట్సాప్ సేవలపై కలెక్టర్ సూచనలు



మనమిత్ర వాట్సాప్ సేవల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే వాట్సాప్ సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో వాట్సాప్ సేవల అమలుపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మన మిత్ర పేరుతో వాట్సాప్ నంబర్ 9552300009ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని, హాయ్ అని సందేశం పంపితే హాయిగా ప్రజలు సేవలు పొందవచ్చని అన్నారు. ఈ నంబర్‌ను సేవ్ చేసుకోవాలని సూచించారు. హాయ్ అని సందేశం పంపి చాట్ చేయాలని, కావాల్సిన సేవను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఆ తరువాత వివరాలు నమోదు చేసి, ఒకసారి తనిఖీ చేసుకోవాలని, ఆ తర్వాత రియల్ టైమ్ అప్డేట్ లేదా కన్ఫర్మేషన్ సందేశాన్ని పంపుతుందని తెలిపారు. కావాల్సిన ఈ-ధ్రువీకరణ పత్రాలు, రశీదులను అందజేస్తుందని తెలిపారు. ఇలాంటి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టరు కోరారు.

డీఎస్సీపై ఉత్కంఠ..!

ఉమ్మడి జిల్లాలో 807 ఖాళీలని నివేదిక

7

ప్రజలకు ప్రభుత్వానికి వారధి ఎన్‌జీజీఓలు

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లతోనే కూటమి గెలుపు

- ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్న సీఎం చంద్రబాబు
- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- స్వేచ్ఛాయుత వాతావరణం.. కూటమి ప్రభుత్వ చలువే
- ఏపీఎన్‌జీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట శివారెడ్డి
- సంఘం జిల్లా కార్యాలయం ప్రారంభం



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీఎన్‌జీజీఓ నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజలకు, ప్రభుత్వానికి ఏపీ ఎన్‌జీజీఓలు వారధి అని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సహకారంతోనే గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఏపీ ఎన్‌జీజీఓ జిల్లా కార్యాలయాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఏపీ ఎన్‌జీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అంతకు మునుపు క్లాక్ టవర్ నుంచి కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు అనంతరం నిర్వహించిన. సమావేశంలో ఎంపీ ప్రసంగించారు. వైసీపీ పాలనలో న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యోగులు రోడ్డెక్కాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. సకాలంలో జీతాలు, బకాయిలు అందక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కూటమిపై నమ్మకంతో గెలిపించారని, ప్రభుత్వం ఏర్పడ్డాక బకాయిలను ఒక్కొక్కటిగా చెల్లిస్తోందని అన్నారు. సమస్యలపై అన్ని ఉద్యోగ సంఘాల నాయకులతో సీఎం చర్చలు జరుపుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యోగులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు సీఎం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు.

వెలుగులు నింపే ప్రయత్నం: దగ్గుపాటి

వైసీపీ పాలనలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. డీఏలు, అరియర్స్ జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ తదితర బకాయిలు (మిగతా 7లో..)

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

యాడికి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కమ్మ వీధికి చెందిన ఉపాధికూలీ కంబగిరి రాముడు(53) బుధవారం వడదెబ్బతో మృతిచెందాడు. ఉపాధి పనులకు వెళ్లి, మంగళవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తర్వాత కంబగిరి రాముడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి, కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కంబగిరి రాముడుకు భార్య సావిత్రి, కూతురు ఉన్నారు.



కంబగిరి రాముడు (ఫైల్)



ఆ రోజు ఏం జరిగింది..?

మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన సమయంలో కుంటిమద్ది హెలిప్యాడ్ వద్ద చోటు చేసుకున్న సంఘటనల గురించి కో పైలెట్ శేయాజ్ జైన్‌ను పోలీసులు విచారించారు. సీకే పల్లిలోని రామగిరి సర్కిల్ కార్యాలయానికి తన న్యాయవాదితో కలిసి జైన్ వచ్చారు. పైలెట్ అనిల్ కుమార్ గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

- ఆంధ్రజ్యోతి, చెన్నేకొత్తపల్లి

(వివరాలు మెయిన్‌లో..)



కోర్టుకు కియ నిందితులు

కియ కారు ఇంజిన్లను చోరీ చేసిన కేసులో ఎనిమిది మంది నిందితులను సిట్ పోలీసులు పెనుకొండ కోర్టు ఎదుట బుధవారం రాత్రి హాజరుపరిచారు. వీరిలో ఏడుగురు తమిళులు కాగా, ఒకరు చిత్తూరు జిల్లా పుంగనూరువాసి.

- ఆంధ్రజ్యోతి, పెనుకొండ టౌన్

10వేల ఎకరాల్లో పండ్లతోటల పెంపకం

జిల్లా ఉద్యాన శాఖాధికారి ఫిరోజ్ ఖాన్



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి ఫిరోజ్ ఖాన్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది ఉపాధి పథకం కింద 10 వేల ఎకరాల్లో పండ్లతోటల పెంపకం చేపట్టనున్నట్లు జిల్లా అటవీ శాఖాధికారి ఫిరోజ్ ఖాన్ తెలిపారు. స్థానిక డ్వామా సమావేశమందిరంలో బుధవారం సాయంత్రం ఉపాధి కింద డ్రైల్యాండ్ హార్టికల్చర్‌పై సమీక్ష నిర్వహించారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ.. జిల్లాలో 59వేల హెక్టార్లు పండ్లతోటల సాగుకు అనుకూలం అన్నారు. ఇందులో 37 వేల హెక్టార్ల భూమి తక్షణ పండ్లతోటల సాగుకు అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఈ ఏడాదిలో 10వేల ఎకరాల్లో ఉపాధి పథకం కింద పండ్లతోటల పెంపకం చేపట్టనున్నట్లు తెలిపారు. ఐదెకరాల్లోపు ఉన్న రైతులు అర్హులనీ, నెలాఖరులోపు అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, మే నెలలో పండ్లతోటల సాగుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అర్హులైన రైతులకు 17రకాల పండ్లమొక్కలు అందజేస్తామన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీంబాషా, ఏపీడీలు, ఉపాధి సిబ్బంది, ఉద్యాన శాఖాధికారులు పాల్గొన్నారు.

నేడు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక గ్రీవెన్స్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి గురువారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమశాఖ డీడీ రాధిక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు సమస్యలను ఫిర్యాదుల రూపంలో అందజేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



(సెంట్రల్ యూనివర్సిటీ ప్రాంగణంలో..)
- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

డీఎస్సీపై ఉత్కంఠ..!

ఉమ్మడి జిల్లాలో 807 ఖాళీలని నివేదిక

'స్పెషల్' కింద 201 పోస్టుల కేటాయింపు

ఆ అభ్యర్థులకు బంపర్ ఆఫర్

డైరెక్టరేట్ సమావేశానికి జిల్లా విద్యాశాఖాధికారులు

అనంతపురం విద్య, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నోటిఫికేషన్, పోస్టుల సంఖ్యపై ఉత్కంఠ నెలకొంది. ఎప్పుడెప్పుడు నోటిఫికేషన్ విడుదల చేస్తారా అని అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. మరో వారం రోజుల్లో నోటిఫికేషన్ వస్తుందన్న ప్రకటనలు వినిపిస్తుండటంతో మరింత ఉత్కంఠ కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 807 ఖాళీలున్నాయని గతంలో జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. ఇటీవల స్పెషల్ ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 201 మంజూరు చేశారు. స్పెషల్ పోస్టుల ప్రకటనతో స్పెషల్ ఎడ్యుకేషన్ చేసిన అభ్యర్థులకు బంపర్ ఆఫర్ అని ఆయావర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

ఖాళీలపై గతంలోనే నివేదిక

ఉమ్మడి జిల్లాలో జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వరంగ స్కూళ్లలో మొత్తం 661 ఉపాధ్యాయ పోస్టులు, మున్సిపాలిటీల్లో 146 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు గత ఏడాది నవంబరులోనే కలెక్టర్‌కు నివేదించారు. కలెక్టర్ ఆమోదం తర్వాత విద్యాశాఖ కమిషనర్‌కు ఖాళీల జాబితాను పంపారు. కొత్త ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి భారీగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటి సంతకం మెగా డీఎస్సీ ఫైల్‌పైనే చేశారు. రాష్ట్రంలో 16,347 పోస్టులు భర్తీ చేస్తామని అప్పట్లోనే ప్రకటించారు. గతంలోనే అన్ని జిల్లాల్లో ఖాళీలపై కసరత్తు చేశారు. ఈ ఏడాది మే నెలలో ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణను లెక్కలోకి తీసుకుని ఈ ఖాళీలను గుర్తించినట్టు తెలుస్తోంది.

స్పెషల్ ఖాళీలు

మెగా డీఎస్సీలో 'స్పెషల్' పోస్టుల మంజూరు చేశారు. కొత్తగా స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులను మంజూరు చేస్తూ.. విద్యాశాఖ రెండు రోజుల కిందట జీవో జారీ చేసింది. ఉమ్మడి జిల్లాకు స్పెషల్ ఎస్‌జీటీ 101 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్లు మరో 100 వరకూ మంజూరు చేశారు. ఈ పోస్టులు మెగా డీఎస్సీలోనే భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. నోటిఫికేషన్ విడుదలైతేగాని మొత్తం ఖాళీలపై స్పష్టత వచ్చేలా లేదు. డీఎస్సీ ఖాళీలపై చర్చించేందుకు అన్ని జిల్లాల విద్యాశాఖాకారులు విజయవాడకు రావాలంటూ డైరెక్టరేట్ నుంచి ఆదేశాలు రావడంతో అనంతపురం జిల్లా అధికారులు కూడా వెళ్లారు.

చీనీ కాయలు టన్ను రూ.22వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22వేలు, కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1,011 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఉపాధి కూలీలకు ఉచిత బీమా: పీడీ

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ఉచితంగా రూ.2లక్షలు ప్రమాద బీమా కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు. రాజధాని అమరావతి నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ (సీఆర్‌డీ) కృష్ణతేజ మాట్లాడారు. ఈ విషయాలను డ్వామా పీడీ వెల్లడించారు. వేసవిలో స్థానికంగా జాబ్‌కార్డుదారులకు ఉపాధి పనులు కల్పిస్తూ పనిదినాలు పెంచాలని, కనీస వేతనం రూ.307గా చెల్లించాలని తెలిపారు. పశువుల నీటి తొట్టెలకు కేటాయించిన లక్ష్యాన్ని గడువులోపు పూర్తి చేయాలన్నారు. వేసవిలో రోజుకు జిల్లాలో 1.5 లక్షలు పనిదినాలు కల్పించాలని, ప్రస్తుతం 65వేల పనిదినాలు మాత్రమే నమోదువుతున్నట్లు పేర్కొన్నారు. ఈకేవైసీ పూర్తి చేసుకున్న ఆధార్, మొబైల్ నంబరుతో సమీపంలోని గ్రామ సచివాలయాల్లో ఈ-శ్రమ్ పోర్టల్‌లో ఉచిత ప్రమాదబీమా సదుపాయం కోసం కూలీలు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 18-59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన జాబ్‌కార్డుదారులందరూ అర్హులని పేర్కొన్నారు. 60 ఏళ్లు దాటిన అనంతరం ఉపాధి కూలీలకు నెలకు రూ.3వేలు పింఛన్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ అడిషినల్ పీడీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పగలే గొలుసు అపహరణ

గార్లదిన్నె, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడ్డాలపల్లి సమీపంలో బుధవారం పట్టపగలే బంగారం గొలుసును ఓ దుండగుడు అపహరించాడు. నడుచుకుంటూ వెళుతున్న వృద్ధురాలిని ద్విచక్ర వాహనంలో ఎక్కించుకుంటానని నమ్మబలికి ఆమె మెడలో ఉన్న ఐదు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. వివరాల మేరకు.. గుడ్డాలపల్లికి చెందిన సుబ్బారెడ్డి, నీలావతి దంపతులు వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. బుధవారం పని నిమిత్తం నీలావతి గార్లదిన్నెకు వచ్చి కూరగాయలు, నిత్యవసరాలు కొనుగోలు చేసుకుని ఆటోలో బయలుదేరింది. 44వ జాతీయ రహదారి గుడ్డాలపల్లి గేట్ వద్ద ఆటో దిగి గుడ్డాలపల్లికి నడుచుకుంటూ వెళుతోంది. అప్పటికే వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గొలుసును పసిగట్టిన దుండగుడు హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనంలో వచ్చాడు. అవ్వా.. నేను కూడా అటువైపే వెళుతున్నాను, నిన్ను అక్కడ వదిలిపెడుతానని నమ్మబలికి ఆమెను ద్విచక్రవాహనంలో ఎక్కించుకున్నాడు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్దకు వెళ్లగానే తాను అటువైపు పోలేదని ఆమెను ద్విచక్ర వాహనం నుంచి దింపాడు. వెంటనే ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. బంధువులు, గ్రామస్థులు దుండగుడి కోసం వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి దుండగుడి కోసం గాలించారు. పలు చోట్ల సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

క్రిమినల్ కేసు నమోదు

తనకల్లు, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగదిన్నెపల్లికి చెందిన కాయల జనార్దననాయుడుపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా మతాల మధ్య విభేదాలు సృష్టించేలా వివాదాస్పద పోస్టు పెట్టిన అతడిపై కేసు నమోదుచేసి, తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు చెప్పారు. అతడిపై సైబర్ బుల్లీషీట్ ఓపెన్ చేసినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా ప్రత్యక్షంగాగానీ, సోషల్ మీడియా వేదికగాగానీ, విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తే క్రిమినల్ కేసులు తప్పవన్నారు. అలాంటి వారిని బైండోవర్ చేయడంతోపాటు రౌడీ షీట్‌గానీ, సైబర్ బుల్లీషీట్‌గానీ ఓపెన్ చేసి, వారిపై నిఘా ఉంచనున్నట్లు చెప్పారు.

పోలీసులపై ఎస్పీకి ఫిర్యాదు..!

గార్లదిన్నె ఎస్‌ఐ, కానిస్టేబుల్ దాడి చేశారంటూ టీడీపీ నాయకుడి ఫిర్యాదు

అనంతపురంరూరల్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): తనపై గార్లదిన్నె ఎస్‌ఐ గౌస్ మహమ్మద్, అదే స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ నరేశ్ దాడి చేశారంటూ మండలంలోని కట్టకిందపల్లికి చెందిన టీడీపీ నాయకుడు నాగేంద్రరెడ్డి ఫిర్యాదు చేశారు. బుధవారం ఎస్పీ జగదీష్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. నాగేంద్రరెడ్డి మాట్లాడుతూ.. తన చెల్లెలు లక్ష్మీకుమారిని గార్లదిన్నెకు చెందిన వెంకటనారాయణరెడ్డికిచ్చి వివాహం చేశారన్నారు. ఆయనకు ఇద్దరు చెల్లెళ్లు వెంకటనారాయణమ్మ, కృష్ణవేణి ఉన్నారన్నారు. ఈనెల 12న మామాకోడళ్ల మధ్య చిన్నపాటి గొడవ తలెత్తిందన్నారు. దీనిని అదునుగా చేసుకుని వెంకటనారాయణమ్మ, కృష్ణవేణి వారి తండ్రి వెంకటరామిరెడ్డితో కలిసి ఆస్తి తగాదాల్ని ముడిపెట్టి తన చెల్లెలిని పోలీసు స్టేషన్ వరకు తీసుకెళ్లారన్నారు. 'నా చెల్లికి సర్దిచెప్పేందుకు పోలీసు స్టేషన్‌కు వెళ్లానన్నా'రు. స్టేషన్‌లో ఎస్‌ఐ గౌస్‌మహమ్మద్, కానిస్టేబుల్ నరేష్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమపై దురుసుగా ప్రవర్తించారన్నారు. వెంకట్రామిరెడ్డి, ఆయన పెద్ద కూతురు వెంకటనారాయణమ్మ.. పోలీసుల సమక్షంలో తనపై దాడికి యత్నించారన్నారు. తనపై దాడిని ఆపకపోగా.. తన కాలర్ పట్టుకొని ఎస్‌ఐ, కానిస్టేబుల్ దాడి చేశారన్నారు. తాను అనారోగ్యం బారినపడి చికిత్స చేయించుకుంటున్నానని చెప్పినా వినకుండా తలపై కొట్టారన్నారు. సర్దిచెప్పేందుకు వెళ్లిన తనపై దాడి చేయడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. తనపై దాడిచేసిన ఎస్‌ఐ, కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

ముగిసిన కందుల కొనుగోలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కందుల కొనుగోలు ప్రక్రియ ముగిసినట్లు ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 25 నుంచి జిల్లా వ్యాప్తంగా 31 కేంద్రాల ద్వారా కందులు కొనుగోలు చేశారమన్నారు. ఈసారి జిల్లాకు 17వేల మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు చేసేందుకు అనుమతినివ్వగా.. 8,300 మంది రైతులతో 11,485 మెట్రిక్ టన్నుల కందులు మద్దతు ధరతో కొనుగోలు చేశామని పేర్కొన్నారు. ఈనెల 20వతేదీలోగా సేకరించిన కందులను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిర్దేశించిన గోదాములకు తరలించాలని తెలిపారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆ శాఖ ఎస్ఈ సురేష్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో జిల్లాలోని సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ పరంగా అమలు జరుగుతున్న పథకాల గురించి డివిజన్ల వారిగా డీఈలతో సమీక్షించారు. పలు ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయడంలో వెనుకబడిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకెన్నిరోజులు కావాలని ప్రశ్నించారు. జలజీవన్ మిషన్ (జేజేఎం) పథకంలో జరుగుతున్న పనులపై ఆరా తీశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఎక్కడా తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఆదేశించారు. శ్రీరామిరెడ్డి పథకం ద్వారా సరఫరా చేస్తున్న గ్రామాల్లో నీటి ఎద్దడిపై ఆరా తీశారు. నాలుగు గ్రామాల్లో కొంత ఇబ్బందిగా ఉందని ఎస్ఈ దృష్టికి తెచ్చారు. ట్యాంకర్ల ద్వారా అయినా సరఫరా చేసి అక్కడ నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో ఈఈ మురళీధర్ రావు, డీఈలు రంగయ్య, శ్రీరాములు, శ్రీధర్, భూపాల్‌రెడ్డి, సఫ్రీనా, చంద్రశేఖర్‌తో పాటు ఏఈలు, ఏఈఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో ఇద్దరి అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగాటిపల్లి పొలాల్లో మహిళను హత్యచేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ ప్రభాకర్ తెలిపారు. కేసు ఛేదింపు వివరాలను ఆయన బుధవారం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ శ్రీనివాసులుతో కలిసి వెల్లడించారు. మండలంలోని రావులచెరువు గ్రామానికి చెందిన చిట్రా అక్కమ్మను చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం వాసి బ్యాళ్ల గంగన్నకిచ్చి 30 ఏళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. అక్కమ్మ 27 ఏళ్ల క్రితం భర్త, పిల్లలను వదిలేసి పుట్టిల్లు రావులచెరువుకు చేరుకుంది. వ్యవసాయ కూలి పనులకు వెళ్తుండేది. ఏడేళ్ల తరువాత ధర్మవరంలోని తిక్కస్వామినగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని, అక్కడే ఉంటుండేది. ఈనేపథ్యంలో గతనెల 16న సాయంత్రం 5.45 గంటల సమయంలో అక్కమ్మను కళాజ్యోతి సర్కిల్ వద్ద ఆటో నడుపుకునే షెక్షావలి, తలారి లోకేంద్ర ఆటోలో ఎక్కించుకుని రేగాటిపల్లి పొలాల్లోకి తీసుకెళ్లారు. అక్కడ తలారి లోకేంద్ర, అక్కమ్మ మధ్య చిన్నపాటి గొడవ తలెత్తింది. అది కాస్తా.. పెద్దది కావడంతో కోపోద్రిక్తుడైన లోకేంద్ర.. షెక్షావలి సాయంతో అక్కమ్మ తలపై రాయితో బలంగా మోది, ఆపై తనవద్దనున్న చాకుతో గొంతు కోసి, ముఖం గుర్తుపట్టకుండా చర్మం కోసి హతమార్చారు. ఎస్పీ రత్న.. హత్యాస్థలాన్ని పరిశీలించి, కేసును సీరియస్‌గా తీసుకున్నారు. త్వరగా ఛేదించాలని సిబ్బందిని ఆదేశించారు. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ శ్రీనివాసులు.. సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం సీతారంపల్లి జాతీయ రహదారి వద్ద నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు. కేసును త్వరతగతిన ఛేదించిన సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది బాబ్‌జాన్, రాజప్ప, షాకీర్, అనిల్‌కుమార్, రాఘవేంద్ర, హెడ్‌కానిస్టేబుల్ చత్రూనాయక్, రామాంజనేయులును ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధి ఎన్‌జీజీఓలు

(5వ పేజీ తరువాయి)

ఒక్కొక్కటిగా చెల్లిస్తోందని అన్నారు. డీఏలపై చర్చలు జరుపుతున్నారని, త్వరలోనే అందించే అవకాశం ఉందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు.

వైసీపీ నాశనం చేసింది: వెంకటశివారెడ్డి

రూ.30 వేల కోట్ల బకాయిలు పెట్టి ఉద్యోగుల జీవితాలను వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందని ఏపీఎన్‌జీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటశివారెడ్డి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం మూడు బకాయి డీఏలను విడుదల చేస్తుందనే నమ్మకం తమకు ఉందని అన్నారు. 12వ పీఆర్సీ కమిటీకి చైర్మన్‌ను నియమించిన వెంటనే ఐఆర్‌ను ప్రకటించాలని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఫీల్డ్ సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్స్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఎంహెచ్ఎం స్కీం ఉద్యోగులకు మినిమమ్ టైం స్కేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు ఇతర పనులు అప్పజెప్పకుండా చూడాలని కోరారు. ఉద్యోగులకు అండగా నిలుస్తున్న ప్రభుత్వానికి సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

వెలుగులు చూడలేమని అనుకున్నాం: విద్యాసాగర్

చీకటి రోజులను దాటుకుని వెలుగులు చూడలేమని ఉద్యోగులం అనుకున్నామని, రాష్ట్ర ప్రభుత్వం తమకు భరోసా ఇచ్చిందని ఏపీ ఎన్‌జీజీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ అన్నారు. డిమాండ్ల సాధన కోసం వైసీపీ ప్రభుత్వం రోడ్లెక్కేలా చేసిందని, అక్రమ కేసులు పెట్టిందని విమర్శించారు. అందుకే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ పతనానికి, కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు బీజం వేశామని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఉద్యోగులకు అండగా నిలుస్తోందని అన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణం కూటమి ప్రభుత్వ చలవేనని అన్నారు. పెండింగ్ ఉన్న మూడు డీఏల్లో కనీసం ఒకటైనా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీజీఓ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ దస్తగిరి రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ, ప్రసాద్ యాదవ్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు వెంగళ్ రెడ్డి, కార్యదర్శి జవహర్, కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి రవికుమార్, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్, నాయకులు వెంకటేష్‌బాబు, జమీలా బేగం, రవికుమార్, రవీంద్రనాథ్‌రెడ్డి, ప్రసాద్, శ్రీనివాస్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, లింగమేష్, మహేష్‌రెడ్డి, శోభారాణి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చేశాయ్..!

జిల్లాకు 650 కేటాయింపు.. 500 కి.మీ. వైరు సైతం..

అనంతకు చేరిన వైనం...

రైతులు, వినియోగదారులకు ఊరట

అనంతపురంరూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు జిల్లాకు ట్రాన్స్‌ఫార్మర్లు, వైరు వచ్చింది. కొన్ని నెలలుగా వైరు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యతో ఇబ్బందులు పడుతున్న రైతులు, వినియోగదారులకు ఊరట లభించినట్లయింది. సార్వత్రిక ఎన్నికల ముందు నుంచి విద్యుత్ శాఖకు ట్రాన్స్‌ఫార్మర్లు, వైరు సరఫరా నిలిచిపోయింది. ఎన్నికల అనంతరం మధ్యలో కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చినప్పటికీ.. వైరు మాత్రం అందలేదు. దీంతో వ్యవసాయ కనెక్షన్ల కోసం రైతులు డబ్బులు కట్టి ఇబ్బందులు పడుతూ వచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్లు తీసుకెళ్లినా వైరు లేక కనెక్షన్ ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఈక్రమంలో రైతులకు సమాధానం చెప్పుకోలేక క్షేత్రస్థాయిలో విద్యుత్ సిబ్బంది, అధికారులు అవస్థలు పడ్డారు. కండక్టర్ ఎప్పుడొస్తుందా అంటూ ఎదురుచూడడం ఆయావర్గాల వంతైంది. కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు, వైరు జిల్లాకు రావడంతో ఆయావర్గాలు హర్షం వ్యక్త చేస్తున్నాయి.

జిల్లాకు చేరాయి..

ఇప్పటికే జిల్లా కేంద్రంలోని స్టోర్‌కు ట్రాన్స్‌ఫార్మర్లు, వైరు చేరింది. 650 ట్రాన్స్‌ఫార్మర్లు, 500 కిలోమీటర్ల మేర కండక్టర్ వచ్చింది. ఆ మేరకు జిల్లాలోని మండలాల వారీగా ట్రాన్స్‌ఫార్మర్లను జిల్లా విద్యుత్ శాఖాధికారి కేటాయించారు. గుంతకల్లు నియోజకవర్గంలోని ప్రాంతాలకు 47, కళ్యాణదుర్గం పరిధికి 105, రాప్తాడు పరిధి మూడు మండలాలకు 40, రాయదుర్గానికి 201, శింగనమల మండలాలకు 94, తాడిపత్రికి 40, ఉరవకొండకు 114 ట్రాన్స్‌ఫార్మర్లు కేటాయించారు. వైరు 500 కిలోమీటర్ల మేర మంజూరైంది. వైరు కొరత తీవ్రంగా ఉండటంతో అవసరం మేరకు కేటాయించనున్నారు.

మూడు, నాలుగు నెలల్లో సమస్య కొలిక్కి..

ఎన్నికల కోడ్‌కు ముందు నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు, వైరు సరఫరాలో జాప్యం తలెత్తింది. దాదాపు ఆరు నెలలు పూర్తిగా నిలిచిపోయింది. ఆ తరువాత కూడా వైరు సరఫరా టెండర్ ప్రక్రియలో సమస్యలతో సరఫరా ఆగింది. ఈ సమస్య కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే ట్రాన్స్‌ఫార్మర్లు, వైరు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లు గతేడాది జూన్ 30వ తేదీ వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులకు అందిచనున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది మార్చి చివరి వరకు ఉన్న దరఖాస్తులకు 1500 ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం ఉన్నట్లు సదరు అధికారుల ద్వారా తెలుస్తోంది. వైరు రూ.2వేల కిలోమీటర్ల వరకు అవసరం ఉన్నట్లు జిల్లా ఉన్నతాధికారులు.. సంస్థకు నివేదించారు. విడతల వారీగా సరఫరా అయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. మూడు, నాలుగు నెలల్లో ఈఏడాది మార్చి ఆఖరు వరకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ అందించే ప్రక్రియ కొల్కికి వచ్చే అవకాశం ఉందని వెల్లడిస్తున్నారు.



విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం స్టోర్స్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

సీనియారిటీ ప్రకారం అందజేస్తాం



ప్రస్తుతం అవసరం మేరకు ట్రాన్స్‌ఫార్మర్లు, వైరు సరఫరా అవుతున్నాయి. వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లను సంబంధిత ఏఈలకు కేటాయించాం. సీనియారిటీ ప్రకారం 2024 జూన్ వరకు పెండింగ్‌లో ఉన్నవారికి వీటిని అందిస్తాం. మరో మూడు, నాలుగు నెలల్లో ఈ ఏడాది మార్చి ఆఖరు వరకు దరఖాస్తుదారులకు అంచనాలు రూపొందించి, పంపిణీ చేస్తాం.

-శేషాద్రి శేఖర్, ఎస్ఈ, విద్యుత్ శాఖ

వ్యసనాల కోసం గొలుసు చోరీలు

నలుగురు అంతర్ జిల్లా చైన్‌స్నాచర్ల అరెస్టు

19 కేసుల ఛేదింపు...

36 తులాల బంగారు నగలు, 3 బైక్‌ల స్వాధీనం

అనంతపురం క్రైం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా వెళ్లే మహిళలను టార్గెట్ చేసి చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడే ముఠాను పోలీసులు పట్టుకున్నారు. నలుగురు అంతర్ జిల్లా చైన్‌స్నాచర్లను అనంతపురం రూరల్, నాలుగో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. వ్యసనాలకు అలవాటుపడిన వారు వాటిని తీర్చుకునేందుకు గొలుసు చోరీలను ఎంచుకుని, కటకటాలపాలయ్యారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ జగదీష్.. నిందితుల అరెస్టు వివరాలు వెల్లడించారు.

అరెస్టయిన వారు వీరే..

అనంతపురం నగరంలోని రాజీవ్‌కాలనీ పంచాయతీకి చెందిన పంపాచారి అలియాస్ నరేష్, రాయల్ నగర్ వాసి షేక్ షాకీర్, శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడకు చెందిన కంబం నాగార్జున (ప్రస్తుతం అనంతపురంలోని సుఖదేవనగర్‌లో నివాసం), ప్రియాంకనగర్‌కు చెందిన షేక్ ఫజిల్ అహ్మద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పంపాచారి కార్పెంటర్, డ్రైవింగ్ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. పేకాట, క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటు పడి సంపాదనంతా వ్యసనాలకే ఖర్చు పెట్టేవాడు. షేక్ జాకీర్ కూడా కార్పెంటరే. రాయల్‌నగర్‌లో ఫర్నీచర్ షాపు పెట్టుకున్న ఇతడికి వ్యాపారం సరిగా సాగక అప్పులెక్కువయ్యాయి. వాటిని తీర్చుకోవడానికి చోరీలకు అలవాటుపడ్డాడు. నల్లమాడ నుంచి కంబం నాగార్జున బతుకుదెరువు కోసం ఏడాదిన్నర క్రి తం అనంతపురం చేరాడు. డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుండేవాడు. ప్రియాంకనగర్‌కు చెందిన షేక్ ఫజిల్ అహ్మద్ ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు ప డి అప్పులపాలయ్యాడు. అప్పుల వారి ఒత్తిడి ఒక వైపు, పెళ్లి ఖరారు కావడంతో ఖర్చుల కోసం డబ్బులేక ఇబ్బందులు పడ్డాడు. సులభంగా సంపాదించాలనుకున్నాడు. చైన్‌స్నాచింగ్‌లను ఎంచుకున్నాడు.

మూడు గ్రూపులుగా ఏర్పడి..

నిందితుల్లో పంపాచారి కీలకం. ఇతడికి కొన్ని నెలల క్రితం షేక్ జాకీర్, కంబం నాగార్జునతో వేర్వేరుగా పరిచయమైంది. స్నేహితులుగా మారారు. పేకాట, ఆన్‌లైన్ జూదం ఆడేవారు. వాటిలో డబ్బు పోగొట్టుకుని చైన్‌స్నాచింగ్‌ల బాట పట్టారు. కాలక్రమంలో ముగ్గురూ స్నేహితులయ్యారు. పంపాచారి ఈ ఇద్దరితో వేర్వేరుగా వ్యవహారం నడిపాడు. తనొక్కడే ముఠాగా, తాను, షేక్ జాకీర్ రెండో ముఠాగా, తాను, కంబం నాగార్జున మూడో ముఠాగా ఏర్పడి ఒకరికి తెలియకుండా మరొకరితో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. ఒంటరి మహిళలను టార్గెట్ చేసేవారు. 2023 నుంచి పంపాచారి కురుగుంట, మన్నీల, రాప్తాడు, కళ్యాణదుర్గం రోడ్డు, గణేష్‌నగర్, లలితానగర్, ఒకటోరోడ్డు తదితర ప్రాంతాల్లో 10 చైన్‌స్నాచింగ్‌లు చేశాడు. రెండో ముఠాగా షేక్ జాకీర్‌తో కలిసి బైక్‌పై వెళ్లి కళ్యాణదుర్గం రోడ్డు, ద్వారకా విల్లాస్‌లో 2 చైన్‌స్నాచింగ్‌లు చేశాడు. కంబం నాగార్జునతో కలిసి హెచ్చెల్సీ రోడ్డు, స్టాలిన్ నగర్, బుక్కరాయసముద్రం చెరువు, బి.కొత్తపల్లిలో నాలుగు స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. మొత్తం 16 కేసుల్లో పంపాచారి నిందితుడు. ఈ కేసుల్లో షేక్ జాకీర్ 2, కంబం నాగార్జున 4 కేసుల్లో నిందితులు. అనంతపురం రూరల్ పీఎస్‌లో 9, బీకేఎస్‌లో 2, ఇటుకలపల్లి పీఎస్‌లో 1, అనంతపురం త్రీటౌన్‌లో 3, రాప్తాడులో 2, ఫోర్త్‌టౌన్‌లో 3 కలిపి మొత్తం 19 కేసులు నమోదయ్యాయి.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జగదీష్

ఆ ఒక్కడే...

నిందితుల్లో షేక్ ఫజిల్ అహ్మద్ ఒక్కడే చైన్‌స్నాచర్ అవతారమెత్తాడు. ఎవరూ గుర్తుపట్టకుండా తలకు ఎరుపు రంగు క్యాప్, ముఖానికి ఖర్చీప్ కట్టుకుని, తక్కువ జనసంచారం ఉన్న ప్రాంతాల్లో ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకుని గొలుసు దొంగతనాలకు పాల్పడేవాడు. హెచ్చెల్సీ సమీపంలో ఓ సచివాలయ ఉద్యోగిని వెంబడించి, ఆమె మెడలోని బంగారు గొలుసు, నాలుగో పోలీసు స్టేషన్ పరిధి ఏఎస్ఆర్ నగర్‌లో వెళ్తున్న ఓ మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లాడు. రాప్తాడు పరిధిలో కార్పన్ సిటీ సమీపంలో ఓ మహిళ మెడలో నుంచి బంగారు చైన్‌ను లాక్కున్నాడు.

అరెస్టు.. ప్రశంస..

వరుస చైన్‌స్నాచింగ్‌లకు అడ్డుకట్ట వేయాలని ఎస్పీ జగదీష్ ఆదేశాలిచ్చారు. డీఎస్పీల పర్యవేక్షణలో సీఐలు శేఖర్, సాయినాథ్, ఇస్మాయిల్, జయపాల్‌రెడ్డి, ఎస్‌ఐలు రాజశేఖర్ రెడ్డి, రాంబాబు, హెడ్ కానిస్టేబుల్ గిరిబాబు, కానిస్టేబుళ్లు శివయ్య, పాండవ, ప్రసాద్ బృందంగా ఏర్పడి, ఆ పనిలో నిమగ్నమయ్యారు. సమాచారం అందడంతో పోలీసు బృందాలు రాచానపల్లి, రాయల్ నగర్, సుఖదేవ్‌నగర్‌లో చైన్‌స్నాచర్లను అరెస్టు చేశారు. ముఠాలను పట్టుకున్న రూరల్ సీఐ శేఖర్, ఫోర్త్‌టౌన్ సీఐ సాయినాథ్, సీసీఎస్ సీఐలు ఇస్మాయిల్, జయపాల్‌రెడ్డి, ఎస్పీ ఎస్‌ఐ రాజశేఖర్ రెడ్డి, రూరల్ ఎస్‌ఐ రాంబాబును ఎస్పీ జగదీష్ అభినందించారు.

పరిగిలో భారీ చోరీ

35 తులాల బంగారం, రూ.40వేల నగదు అపహరణ

పరిగి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఇంటి యజమానులు పుణ్యక్షేత్రాలకు వెళ్లిన సమయంలో దొంగలు భారీ చోరీకి పాల్పడ్డారు. మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ విద్యానగర్‌లోని ఓ ఇంట్లో మంగళవారం రాత్రి దొంగలుపడ్డారు. బాధితుడు శంకరప్ప అందించిన సమాచారం మేరకు.. రెండ్రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి పుణ్యక్షేత్రాలకు వెళ్లి బుధవారం తిరిగి వచ్చారు. అప్పటికే ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అవాక్కయ్యారు. లోపలికి వెళ్లి చూడగా బీరువా పగలకొట్టి అందులోని రూ.40వేలు నగదు, 35 తులాల బంగారం దోచుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పెనుకొండ డీఎస్పీ నర్సింగప్ప చోరీ జరిగిన ఇంటి వద్దకు వచ్చి పరిశీలించారు. సీసీ కెమెరాలు, ఇతర సమాచారం ఆధారంగా విచారణ చేపట్టాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. కాగా, వరుస చోరీలతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. రెండ్రోజుల క్రితం మెయిన్ రోడ్డుపై ఉన్న రెండు దుకాణాలు, ఓ ఇంట్లో చోరీకి తెగబడ్డారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు కాలనీల్లో బీట్ నిర్వహించి చోరీలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆన్‌లైన్ మాయ..!

● సచివాలయానికి రాకుండానే హాజరు నమోదు
● ఉప్పరపల్లి సచివాలయ ఉద్యోగుల సమయపాలనలో తేడాలు



10:00గంటల సమయంలో ఖాళీగా ఉన్న సచివాలయ ఉద్యోగుల కుర్చీలు

ఆంధ్రజ్యోతి విజిట్

అనంతపురంరూరల్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల హాజరులో ఆన్‌లైన్ విధానంతో ప్రజలకు ఎంత ఉపయోగపడుతుందో తెలియదు కాని, ఉద్యోగులకు మాత్రం బాగానే సహకరిస్తోంది. ఇందుకు అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి సచివాలయ ఉద్యోగుల హాజరు నిదర్శనంగా నిలుస్తోంది. బుధవారం ఆంధ్రజ్యోతి ఉప్పరపల్లి సచివాలయం విజిట్ చేసింది. ఇందులో ఉద్యోగుల హాజరు, సమయపాలనలో తేడాలు తేటతెల్లమయ్యాయి. సచివాలయంలో పంచాయతీ కార్యదర్శితో పాటు మరో తొమ్మిది మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ సెలవులో ఉన్నారు. మిగిలిన ఉద్యోగుల్లో పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎం, విలేజ్ సర్వేయర్ పదిగంటలలోపు విధులకు హాజరయ్యారు. మిగిలిన ఉద్యోగుల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్, వీఆర్వో 10:20కు వచ్చారు. 10:30కి మహిళా పోలీసు, అగ్రికల్చర్ అసిస్టెంట్ 10:35కు వచ్చారు. పంచాయతీ ఉన్నతాధికారే సమయానికి హాజరైతే..ఉద్యోగుల సమయపాలనలో మాత్రం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. అయితే ఆన్‌లైన్‌లో మాత్రం సెలవులో ఉన్న ఉద్యోగులు తప్పా.. మిగిలినవారందరూ పది గంటలలోపే విధులకు హాజరైనట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. సచివాలయానికి రాకుండానే ఆన్‌లైన్‌లో ఇన్‌టైంలో విధులకు హాజరైనట్లు నమోదు కావడాన్ని బట్టిచూస్తే ఉద్యోగులకు ఆన్‌లైన్ హాజరు విధానం ఏవిధంగా మేలుచేకూరుస్తుందో తెలిసిపోతోంది. వాస్తవానికి ఉద్యోగులు సచివాలయానికి వచ్చి హాజరు రిజిస్టర్‌లో సంతకాలు చేయాలి. అయితే ఇందులోనూ ఉద్యోగుల నిర్లక్ష్యం కనిపించింది. పంచాయతీ కార్యదర్శి హాజరు రిజిస్టర్‌లో సంతకం చేయండి అనేంతవరకు కూడా ఉద్యోగులు సంతకం చేసేందుకు వీలుకల్పించుకోలేనిస్థితిలో ఉండటం కనబడింది. వాస్తవానికి ఉద్యోగులు సచివాలయానికి వచ్చి అక్కడ హాజరు నమోదు చేసి అక్కడి నుంచి ఫీల్డ్‌కు వెళితే.. సచివాలయంలోని మూమెంట్ రిజిస్టర్‌లో ఎక్కడికి వెళుతునానరన్న విషయాన్ని నమోదు చేసివెళ్లాల్సి ఉంది. ఇది అక్కడ కనిపించకపోవడం తమ విధుల పట్ల సదరు ఉద్యోగులు ఏపాటి అంకితభావం ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.



10:30గంటలకు సచివాలయంలో పరిస్థితి

మరో 25 ఏళ్లు టీడీపీదే అధికారం

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మరో 25 ఏళ్ల టీడీపీ అధికారంలో ఉంటుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. స్థానిక అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు కాలనీలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు అర్జీలు సమర్పించారు. కొందరు దివ్యాంగులు తమ సమస్యలను చెప్పుకునేందుకురాగా కార్యాలయం నుంచి ఎమ్మెల్యే కిందకు దిగివచ్చి వారి అర్జీలు స్వీకరించారు. హౌసింగ్, రెవెన్యూ సమస్యలపై ఎక్కువగా అర్జీలు వచ్చాయి. సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ చూపుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ఐదేళ్ల ఇళ్లు నిర్మిస్తామని చెప్పి, పేదల నుంచి డబ్బులు వసూలు చేసి, ఒక్క ఇల్లు కూడా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. నాయకులు గంగారామ్, సరిపూటి రమణ, హరికృష్ణ, బాలాంజినేయులు, కడియాల కొండన్న, ఫిరోజ్ అహ్మద్, సైపుద్దీన్, పీఎల్ఎన్‌మూర్తి, స్వామిదాస్, గోపాల్ గౌడ్, రాజారావు, ఓంకార్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సేవలో భాగస్వామినవుతా: అంధ విద్యార్థులు, అనాథ నిరుద్యోగుల కోసం చేస్తున్న సేవలో తానూ భాగస్వామ్యుడిని అవుతానని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. బుధవారం స్థానిక హౌసింగ్ బోర్డులోని మీనాక్షమ్మ సమ్మిళిత కేంద్రంలో కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుకు సహకరించిన బెలుగుప్ప మండలం తగ్గుపర్తికి చెందిన రామకృష్ణను ఎమ్మెల్యే అభినందించారు. సమ్మిళిత కేంద్రం నిర్వాహకులు రవికాంత్ రమణ, నాయకులు వెంకటనారాయణ, దామోదర్‌నాయుడు, తిరుపతినాయుడు, శ్రీనాథ్, బొమ్మినేని శివ పాల్గొన్నారు.



ప్రజల సమస్యలపై ఆరాతీస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

రోడ్లు, కాలువల సమస్య ఉండకూడదు..

అనంతపురం న్యూటౌన్: అనంతపురం రూరల్ పంచాయతీల్లో రోడ్లు, కాలువలు సమస్యలు ఉండకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విద్యుత్, పంచాయతీరాజ్ ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించి చర్చించారు. నియోజకవర్గ పరిధిలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు అవసరం ఉందని, అందుకు అనుగుణంగా స్థల సేకరణ చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్ డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ వెంకటశేషయ్య, ట్రాన్స్‌కో ఎస్ఈ శేషాద్రి శేఖర్, ఈఈ రమేష్, డీఈఈ శ్రీనివాసులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిబద్ధతతో చేపట్టండి: కలెక్టర్

అనంతపురం టౌన్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత కార్యక్రమాలను ప్రతిశాఖ నిర్వహించాలని కలెక్టరు వినోద్‌కుమార్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టరు మాట్లాడుతూ గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం సిబ్బందితో స్వచ్ఛ గ్రీన్‌లీఫ్ రేటింగ్‌సిస్టమ్ జరుగుతోందన్నారు. సురక్షితంగా నిర్వహించే పారిశుధ్యాన్ని ప్రోత్సహించే పద్ధతులను అనుసరించడానికి సౌకర్యాల కోసం స్వచ్ఛతగ్రీన్‌లీఫ్‌రేటింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, డీపీఓ నాగరాజునాయుడు, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, పర్యాటకశాఖాధికారి జయకుమార్ పాల్గొన్నారు.

26 నుంచి రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు

అనంతపురం విద్య, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కడపలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు 26వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు, ప్రధానకార్యదర్శి కుల్లాయిస్వామి తెలిపారు. బుధవారం ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యువగళం పాదయాత్రలో లోకేష్ ఇచ్చిన హామీలు అలాగే ఉన్నాయన్నారు. జీవో 77 రద్ద, ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రతి విద్యార్థికీ తల్లికివందనం వంటివి నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. నాయకులు ఆంజనేయులు, నరసింహ, వెంకట్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

అనంతపురంరూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గాన్ని అణచివేయడానికి కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్ర డిమాండ్ చేశారు. ఆమేరకు బుధవారం మండలంలోని సోమలదొడ్డి గ్రామ సమీపంలోని ఐఎంఎల్ డిపో వద్ద జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, కార్మికులతో కలసి లేబర్ కోడ్ వలన కలిగే నష్టాలకు సంబంధించిన బుక్లెట్‌ను ఆయన విడుదల చేశారు. కార్మికులకు గుదిబండలా తయారవుతున్న లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని మే 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో కార్మిక రంగమంతా పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఐఎంఎల్ డిపో యూనియన్ నాయకులు తిరుపాలు, నాగార్జున, మోహన్‌రెడ్డి, మోహన్ బాబు, నల్లప్ప, పెద్దన్న, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

పూలే విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలి

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంగమేష్ సర్కిల్‌లో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్‌ఈఎఫ్ యువత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఉజ్వల్‌తో కలిసి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు వినతి పత్రాన్ని అందజేశారు. సమాజ విజ్ఞాన దివిటీగా పూలేను స్మరించుకుంటున్నామన్నారు. ఎంపీ స్పందిస్తూ త్వరలోనే ఏర్పాటుచేయిస్తామని పేర్కొన్నారు.

స్కేటింగ్‌లో అనంత చిన్నారి ప్రతిభ

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి రోలర్ స్కేటి ంగ్ పోటీల్లో జిల్లాకు చెందిన హీనా ఫైజా రజత పతకం సాధించింది. సర్వజనాస్పత్రిలో పనిచేస్తున్న ఇర్ఫాన్ కుమార్తె హీనా ఫైజా ఆరేళ్ల వయసులోనే సత్తా చాటుతోంది. పంజాబ్‌లోని మొహాలీలో ఈనెల 12వ తేదీన నిర్వహించిన జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ అండర్-7 బాలికల పోటీల్లో రెండోస్థానంలో నిలిచి, రజత పతకాన్ని దక్కించుకుంది. దీంతో చిన్నారిని పలువురు అభినందించారు.



హీనా ఫైజా

544 మందికి యాంత్రీకరణ పరికరాల మంజూరు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటి వరకు 544 మందికి యాంత్రీకరణ పరికరాలు మంజూరు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి జిల్లాలో 1359మంది రైతులకు రూ.3 కోట్ల విలువైన పరికరాలు మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించిందన్నారు. ఇప్పటివరకు 869 మంది దరఖాస్తు చేసుకోగా 544 మందికి రూ.1.32 కోట్ల విలువైన పరికరాలు మంజూరు చేశామన్నారు.

సీపీఎస్ ఉద్యోగులపై కేసులు ఎత్తివేయాలి

అనంతపురం విద్య, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని ఏపీటీఎఫ్ నాయకులు ఏపీ జేఏసీ చైర్మన్ శివారెడ్డి, ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధానకార్యదర్శి విద్యాసాగర్‌ను ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. బుధవారం అనంతపురం వచ్చిన ఆ ఇద్దరు నేతలను ఏపీటీఎఫ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. టీచర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసనాయక్, కులశేఖర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపుపై వాగ్వాదం

కనగానపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక పింఛ న్లు తొలగిస్తున్నారని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ ఆరోపించడంతో టీడీపీ ఎం పీటీసీలు, సర్పంచులు ఆమెతో వాగ్వాదానికి దిగారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం మారాక సామాజిక పింఛన్లు తొలగిస్తున్నారన్నారు. దీంతో టీడీపీ ఎంపీటీసీలు, సర్పంచులు బిల్లే భాస్కర్, సోమర చంద్రశేఖర్, రాజాక్రిష్ణ, రామాంజి వాగ్వాదానికి దిగారు. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ సానుభూతిపరుల పింఛన్లు తొలగించరాని, నేడు అనర్హుల పింఛన్లు మాత్రమే తొలగిస్తారన్నారు.

పురస్కారాలు అందుకున్న అనంత కళాకారులు



పురస్కారాలతో కళాకారులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన కళాకారులు.. కందుకూరి విశిష్ట పురస్కారాలను అందుకున్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ చలనచిత్ర టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికిగాను రాష్ట్రవ్యాప్తంగా 107 మందికి పురస్కారాలు ప్రకటించింది. జిల్లాకి చెందిన 13 మందిని ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అనంత కళాకారులు వాల్మీకి కుళ్లాయప్ప, సోమర లక్ష్మీనారాయణ, సంగాల నారాయణస్వామి, పి ఆనంద్, జేకే రామాంజనేయులు, వి ఆదినారాయణరెడ్డి, జీజే ఎర్రిస్వామి, ఎ రామగోపాల్, జి నరహరి, ఎస్ నారాయణస్వామి, శివశంకర్, డి రాజకుళ్లాయప్ప, బి వరప్రసాద్ కు న్యాయవాది గాజుల పద్మజ చేతుల మీదుగా కందుకూరి విశిష్ట పురస్కారాలు అందజేసి, సత్కరించారు.

తొలి సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం

● ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆనాటి సమాజాన్ని పట్టి పీడించిన మూఢనమ్మకాల నిర్మూలనకు కృషిచేసిన తొలి సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతిని పురస్కరించుకుని జన విజ్ఞాన వేదిక(జేవీవీ) నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో 'కందుకూరి వీరేశలింగం జీవితం-స్ఫూర్తి' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు రాచపాలెం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కొంతమంది మహానుభావులను గుర్తుచేసుకుంటే వారు చెప్పిన మాటలు గుర్తొస్తాయని, ఆ రకంగా వీరేశలింగం పంతులు చెప్పిన 'చిరిగిన చొక్కా అయినా వేసుకో కానీ.. ఒక మంచి పుస్తకం కొనుక్కో' అన్న మాట నేటికీ గుర్తొస్తుంటుందన్నారు. కార్యక్రమంలో జేవీవీ సమత జిల్లా కన్వీనర్ డాక్టర్ ప్రసూన, గాంగేనాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక, సాకే భాస్కర్, రోగప్ప, రామిరెడ్డి, ముత్యాలు, ప్రసాద్‌రెడ్డి, తిరుపాలు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి

న్యూస్ బాక్స్

లింగనిర్ధారణ చట్టంపై విస్తృత ప్రచారం

● డీఎంహెచ్ఓ ఈబీ దేవి ఆదేశం



సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం టౌన్, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన కల్పించేందుకు ప్రచారం నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి సూచించారు. బుధవారం జిల్లా కార్యాలయంలో కమిటీతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సినిమా థియేటర్లు, రేడియో ప్రసారాల మాధ్యమాలలో లింగనిర్ధారణ చట్టవిరుద్ధమని, నిర్ధారణ చేస్తే ఎలాంటి చర్యలు ఉంటాయని, ఆడపిల్లల పట్ల వివక్ష చూపరాదని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మరోవైపు ఆడపిల్లల ప్రాముఖ్యత గురించి గోడలపై రాయిస్తామన్నారు. ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టరు యుగంధర్, రవిశంకర్, వైద్యులు రేణుక, శ్రావణి, ఆర్బీటీ డాక్టరు దుర్గేష్, డీపీఆర్ఓ గురుస్వామి, రెడ్స్ భానుజా,ఐ సీడీఎస్ చంద్రకళ, డెమోలు త్యాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

విజయసాయికి అంబేడ్కర్ పురస్కారం



విజయసాయికుమార్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ అంబేడ్కర్ జాతీయ పురస్కారం అందుకున్నారు. అంబేడ్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని సహారా చారిటబుల్ ట్రస్టు, ప్యారడైజ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురిని పురస్కారాలకు ఎంపిక చేశారు. 14న ఢిల్లీలోని ఆంధ్ర భవన్‌లో వారికి పురస్కారాలు అందజేసి సత్కరించారు. వ్యక్తిగత కారణాలవల్ల అవార్డు తీసుకునేందుకు విజయసాయికుమార్ ఢిల్లీ వెళ్లకపోవడం వల్ల నిర్వాహకులు పురస్కారాన్ని కొరియర్ ద్వారా అనంతపురం పంపారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ చేతులమీదుగా విజయసాయికుమార్‌కు పురస్కారం అందజేసి సత్కరించారు.

పౌష్టికాహారంతోనే జబ్బుల నివారణ



పోషణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారానే జబ్బులను అరికట్టగలమని వైద్యుడు రామ్‌కుమార్ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం గౌరవ్ గార్డెన్ పీడబ్ల్యూడీ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్షోత్సవాల కార్యక్రమానికి డాక్టర్లు రామ్‌కుమార్, రఫీక్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రోడ్డుపక్కన లభించే ఆహార పదార్థాలు, జంక్ ఫుడ్ కాకుండా స్వచ్ఛమైన తాజా ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు, పండ్లు, పా లు, గుడ్లు, మాంసం వంటివి తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత, లక్ష్మీదేవి, విజయకుమారి పాల్గొన్నారు.

మందకృష్ణను సత్కరించిన బండారు శంకర్



మందకృష్ణకు బుద్ధుడి విగ్రహం అందజేస్తున్న శంకర్

అనంతపురం టౌన్, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీవర్గీకరణ సాధనకు కృషిచేసిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగను ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి బండారు శంకర్ సత్కరించారు. బుధవారం హైదరాబాద్‌లోని నివాసంలో మందకృష్ణను ఆయన కలిశారు. ఎస్సీజాతి సంక్షేమం, అభివృద్ధికి వర్గీకరణ అవసరమని 30ఏళ్ల పోరాటం ఫలితంగానే వర్గీకరణ సాధ్యమైందని గుర్తుచేస్తూ గౌతమబుద్ధుడి విగ్రహం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

బైక్ ఫీట్లు చేస్తే కఠిన చర్యలు: ఎంవీఐ

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రోడ్లపై యువత బైక్ ఫీట్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) సునీల్ కుమార్ హెచ్చరించారు. అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామ్మూర్తి అధ్యక్షత వహించిన సదస్సుకు ఎంవీఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బైక్ నడిపేటప్పుడు హెల్మెట్, కారు నడిపేటప్పుడు సీటు బెల్ట్ తప్పని సరిగా వినియోగించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డీన్ రాయుడు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు ఖలీల్ బాషా, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దుచేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లును కేంద్రం వెంటనే రద్దు చేయాలని సీకేపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాలకు చెందిన పలువురు ముస్లింలు బుధవారం నిరాహార దీక్ష చేపట్టారు. సీకేపల్లిలో జాతీయ రహదారి కూడలి వద్ద చేపట్టిన దీక్షకు సీపీఎం నాయకులు ఎస్‌హెచ్ బాషా, ఆదినారాయణ, అయూబ్‌ఖాన్, హైదర్‌వలీ మ ద్దతు ప్రకటించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

చెత్త సేకరణ వంద శాతం జరగాలి

అనంతపురం క్రైం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నగరంలో డోర్ టు డోర్ చెత్త సేకరణ వంద శాతం జరగాలని నగర కమిషనర్ బాలస్వామి ఆదేశించారు. బుధవారం పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా సాయినగర్ జీరో క్రాస్‌లో చెత్త సేకరణను తనిఖీ చేశారు. స్థానికులతో మాట్లాడి చెత్త తరలించే వాహనం వస్తుందా..? లేదా..? అని ఆరా తీశారు.

అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇవ్వాలి

నార్పల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులకు రేషన్‌కార్డులు ఇవ్వాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి బుధవారం సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులకు రూ. 20వేలు తక్షణమే ఇవ్వాలని కోరారు. సాకే గంగాధర్, రామాంజి, పాల్గొన్నారు.



రేణుక కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అధైర్యపడకండి.. అండగా ఉంటాం

● ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురంరూరల్,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): అధైర్యపడకండి అండగా ఉంటామని బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరిటాల సునీత భరోసా ఇచ్చారు. మండలంలోని పూలకుంట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నారాయణస్వామి కుమార్తె రేణుక రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుంది. బుధవారం మండల నాయకులతో కలసి ఎమ్మెల్యే బాధిత కుటుంబసభ్యులను ఆమె పరామర్శించారు. రేణుక మృతిపై కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కుటుంబానికి భరోసా ఇచ్చారు. అనంతరం అదే గ్రామంలో ప్రమాదానికి గురై చికిత్స అనంతరం కోలుకున్న దివ్యాంగుడు ఎర్రిస్వామిరెడ్డిపరామర్శించారు. బాధితుడికి ఆర్థిక సాయం చేశారు. మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాగేమురళీమోహన్, నాయకులు శంకర్‌రెడ్డి, కొండారెడ్డి, అజయ్‌రెడ్డి, నాగేంద్ర, మల్లయ్య, క్రిష్ణ, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం.. ఆరోగ్యానికి శ్రేయస్కరం

ఆత్మకూరు: రక్తదానం చేయడం యువతకు శ్రేయస్కరమణి ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలంలోని సనప గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రక్తదానం చేస్తున్న యువతను పలకరించి అభినందించారు. టీడీపీ మండల ఇన్‌చార్జి ధర్మవరపు బాలాజి, కన్వీనర్ శ్రీనివాసులు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురాం, నారాయణస్వామి, శశాంక్ చౌదరి, రఘునాథ్‌రెడ్డి, డిష్ నాగరాజు పాల్గొన్నారు.

రైతుల పట్ల ముఖ్యమంత్రికి ప్రత్యేక శ్రద్ధ

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నార్పల,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): శింగనమల నియోజకవర్గ రైతుల పట్ల సీఎం చంద్రబాబుకు ప్రత్యేక శ్రద్ధ అని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సూక్ష్మ సేద్య పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో పాటు సూక్ష్మ సేద్యం ప్రాధాన్యతను వివరించారు. డ్రిప్ విధానం వల్ల నీటి పొదుపుతో పాటు తక్కువ ఖర్చులో అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని హామీ ఇచ్చారు. తహసీల్దారు అరుణకుమారి, ఎంపీడీఓ భాస్కర్, రైతులు, టీడీపీ నాయకులు జీసీ బాబు, ఆకుల విజయ్‌కుమార్‌బాబు, ఆకుల ప్రసాద్, అనిల్, తేజ, హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలకు నిధులు మంజూరు చేయిస్తా

శింగనమల: నార్పల బాలుర పాఠశాలలో మౌలిక సదుపాయాలకు నిధులు మంజూరు చేసి అభివృద్ధికి బాట వేస్తానని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. బుధవారం పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఎంపీడీఓ భాస్కర్,ఎంఈఓ క్రిష్ణయ్య, అధికారులు పాల్గొన్నారు.

గురుస్వాములకు నంది అవార్డుల ప్రదానం



నంది అవార్డు అందుకుంటున్న బోయ రాము

గార్లదిన్నె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొన్నేళ్లుగా అయప్పస్వామి మాల ధరించి గురుస్వాములుగా పిలవబడుతున్న ఇద్దరికి ఉజ్వల సాంస్కృతిక సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థ నంది అవార్డులు ప్రదానం చేసింది. గార్లదిన్నెకు చెందిన బోయరాము, పెనకచెర్లకు చెందిన బ్యాళ్ల ఈశ్వరయ్య కొనేళ్లుగా అయప్పస్వామి మాల ధరిస్తూ గురుస్వాములుగా ఉంటు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. వీరి సేవలను గుర్తించిన స్వచ్ఛంద సంస్థ హైదారాబాదులో జరిగిన నంది పురస్కారాల కార్యక్రమంలో నంది అవార్డులు, ప్రశంసా పత్రాలను అందచేసి సత్కరించారు.

గుండెపోటుతో రైతు మృతి



లింగమయ్య (ఫైల్)

శింగనమల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో బోయ లింగమయ్య(49) అనే రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని తరిమెల గ్రామంలో చోటు చేసుకుంది..కుంటుబ సభ్యులు తెలిపిన మేరకు తరిమెల గ్రామానికి చెందిన బోయ లింగమయ్య లీలావతి దంపతులు 4.9 ఎకరాల్లో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 5 సంవత్సరాలుగా పొలంలో సాగుచేసిన వేరుశనగ, ఇతరపంటలు దిగుబడులు రాకపోవడంతో రైతు పూర్తిగా నష్టపోయాడు. పంటల కోసం రూ.20 లక్షల వరకు బ్యాంకులు, ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పు చేశాడు. అప్పులు ఇచ్చిన వారు చెల్లించాలని ఒత్తిళ్లు చేయడంతో లింగమయ్య తీవ్ర మనస్థాపంతో ఉన్నాడు. బుధవారం ఉదయం గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమయంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. లింగమయ్యకు భార్య, ఇద్దరు కూమారులు ఉన్నారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

వృద్ధుడి అదృశ్యం



నల్లపరెడ్డి (ఫైల్)

అనంతపురం క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నగర శివారులో నివాసముంటున్న ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఓవీఆర్ కాలనీకి చెందిన నల్లపరెడ్డి మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి నుంచి వాకింగ్‌కు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాలేదు. బుధవారం ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన కుమారుడు హరినాథరెడ్డి అనంతపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యుడు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గం ప్రాంతంలో ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా అమలు చేస్తున్న మల్టీలెవల్ స్కీమ్ (ఎంఎల్ఎస్) అభివృద్ధి పనులను నీటి సరఫరా, శానిటేషన్.. హైజీన్ (వాస్) నైపుణ్యం కలిగిన కేంద్ర బృందం సభ్యుడు హేమలరాజ్ సోలంకి బుధవారం పరిశీలించారు. దాదాపు 85 శాతం పనులు పూర్తయ్యాయనీ, మరో 15 శాతం చేపట్టాల్సి ఉందని డీఈ శ్రీనివాసులు.. కేంద్ర బృందం సభ్యుడికి వివరించారు. శ్రీరామిరెడ్డి పథకం ద్వారా 153 గ్రామాలకు నీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. కొన్ని సాంకేతిక కారణాలతో 39 గ్రామాలకు సరఫర చేయలేకపోయామన్నారు. ప్రస్తుతం 114 గ్రామాలకు నీరు అందుతున్నట్లు డీఈ వివరించారు. 2026 జూన్‌లోపు పనులు పూర్తి చేసి, అన్ని గ్రామాలకు నీరివ్వాలని కేంద్ర బృందం సభ్యుడు ఆదేశించారు. పీఏబీఆర్ నుంచి కౌకుంట్ల వరకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌ను పరిశీలించారు. కణేకల్లు మండలం 43 ఉడేగోలం గ్రామంలో ఇంటింటికీ కొళాయి కనెక్షన్, శానిటేషన్ పనులను పరిశీలించారు. స్థానికులను అడిగి, వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జేఈ శివకృష్ణారెడ్డి, స్థానిక ఈఓఆర్డీ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ


గౌతమాశ్రమంలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న వేదపండితులు

గుత్తి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్‌లోని గౌతమేశ్వర ఆలయంలో బుధవారం ఆంజనేయ స్వామి, నవగ్రహాల ప్రతిష్ఠను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి వేదపండితులు యంత్రప్రతిష్ఠ, సంప్రోక్షణ, ప్రాణప్రతిష్ఠ, కూష్మాండ బలి, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా జరిపారు. తర్వాత విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు, రైల్వే ఉద్యోగులు, గుత్తికోట సంరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

గుంతకల్లు: మండలంలోని పాతకొత్తచెరువు గ్రామంలో నూతనంగా నిర్మించిన కాశిరెడ్డి నాయన ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు ఆలయం వద్ద ఉదయం నుంచి పలు హోమాలు, పూజలు చేశారు. అనంతరం ఆలయాన్ని ప్రారంభించి కాశిరెడ్డి నాయన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హాజరై కాశిరెడ్డి నాయనను దర్శించి పూజలు చేయించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున ఉన్నారు.

ఘనంగా రంగస్థల దినోత్సవం

పామిడి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వరరాగ నాటిక కళాసమితి శిక్షణాలయంలో ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దేవరాజు ఆధ్వర్యంలో బుధవారం తెలుగు నాటక రంగస్థల దినోత్సవ వేడుకలను కళాకారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళా కారులు దేవరాజు, పుంజా కృష్ణారావు మాట్లాడుతూ.. కందుకూరి వీరేశలింగం పంతులు రత్నావళి అను నాటకాన్ని రచించి రంగస్థలంపై ప్రదర్శించారని తెలిపారు. ఆయన జయంతి ని పురస్కరించుకుని ప్రభుత్వం తెలుగు నాటక రంగస్థల దినోత్సవాన్ని ప్రకటించిందన్నారు. అనంతరం సీనియర్ కళాకారుడు కొప్పలకొండ బెస్త ఓబులేసుకు పూలమాలలు, శాలువాతో సన్మా నం చేశారు. కళాకారులు రత్నరాజు, బెస్త సుబ్రహ్మణ్యం, నాగార్జున, నారాయణ, చెన్నప్ప, నారాయణరెడ్డి, చెన్నయ్య, చిదంబరయ్య, పార్థసారథిరెడ్డి పాల్గొన్నారు.

కందుకూరి వీరేశలింగం జయంతి

కళ్యాణదుర్గంరూరల్: సంఘ సంస్కర్త, తొలి తెలుగు నాటక కర్త వీరేశలింగం పంతులు జయంతి వేడుకలను టీడీపీ నాయకులు పట్టణంలోని ప్రజావేదిక వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కోనంకి రాజశేఖర్, నాయకులు మల్లికార్జున, గోళ్ల రమేష్, గౌని శ్రీనివాసరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో కంప్యూటర్ సెంటర్ నిర్వాహకుడు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ కంప్యూటర్ సెంటర్ నిర్వాహకుడిని విజయవాడ సైబర్ క్రైం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక బెంచికొట్టాలలో లూయిస్ అనే వ్యక్తి మరియా ఇన్ఫోటెక్ కంప్యూటర్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. కాగా ఇతను బెంగళూరులో పనిచేసేటప్పుడు ఓ ప్రైవేట్ వెబ్‌సైట్‌కు అనుసంధానంగా పని చేస్తూ ఆ సాంఘిక కార్యక్రమాలు నిర్వహించేవాడు. ఇప్పుడు కూడా అశ్లీల చిత్రాలను డౌన్‌లోడ్ చేస్తున్నట్లు పలువురు గుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెండు రోజుల క్రితం విజయవాడ సైబర్ క్రైం పోలీసులు ఇక్కడికి వచ్చి లూయిస్‌ను అదుపులోకి తీసుకున్నారు.

సీఎస్‌డీటీపై మంత్రి నాదెండ్లకు ఫిర్యాదు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):గుంతకల్లు మండలం నెలగొండ గ్రామంలో ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ బియ్యం సరఫరా చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న సీఎస్‌డీటీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అమరావతిలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్‌కు ధర్మహ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజినేయులు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రేషన్ బియ్యంసరఫరా విషయంలో సీఎస్‌డీటీ తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

సెపక్ తక్రా అసోసియేషన్ సమావేశం

ఉరవకొండ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇండోర్‌స్టేడియంలో బుధవారం సెపక్ తక్రా జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షాహిన్, ఇండోర్ స్టేడియం అధ్యక్షుడు ఎన్‌వీఎస్ చౌదరి పాల్గొని ఈ ఏడాది ఏప క్రీడాంశాలు నిర్వహించాలనేదానిపై చర్చించారు. అలాగే గత ఏడాది జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను సన్మానించారు. అనంతరం జిల్లాలోని 12 క్లబ్‌లకు మెటీరియల్‌ను అందజేశారు. ఇండోర్‌స్టేడియం వైస్ ప్రెసిడెంట్ నర్రాకేశన్న, వ్యాయామ ఉపాధ్యాయులు మారుతి, నాగరాజు, మంజునాథ్, ప్రభాకర్, అలీమా, శ్యామల,అనిత, పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో బెట్టింగ్‌రాయుళ్లు?

తాడిపత్రి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతున్న సందర్భంగా రెండురోజులక్రితం జిల్లా పోలీసులు తాడిపత్రి పట్టణానికి వచ్చి నలుగురు బెట్టింగ్‌రాయుళ్లను తీసుకువెళ్లారని సమాచారం. ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్నారని జిల్లా పోలీసులకు సమాచారం అందడంతో నేరుగా ఇక్కడకు వచ్చి వాటిని సేకరించి నలుగురు బెట్టింగ్ రాయుళ్లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

పనులను నాణ్యతగా చేపట్టాలి

రాయదుర్గం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యనారాయణస్వామి ఆలయం వద్ద రూ. 13.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళు శిల్ప బుధవారం భూమిపూజ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల్ని నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు, అధికారులకు సూచించారు. కమిషనర్ దివాకర్‌రెడ్డి, కౌన్సిలర్ ప్రశాంతి, టీడీపీ నాయకులు టంకశాల హనుమంతు, పొరాళుపురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని కారు దగ్ధం


కాలిపోయిన కారు

కూడేరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జల్లిపల్లి టోల్‌గేట్ సమీపంలో గుర్తు తెలియని కారు దగ్ధమైంది. పోలీసులు అందించిన వివరాల మేరకు.. మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఉరవకొండ నుంచి అనంతపురం వైపు వస్తున్న కారుకు టోల్ గేట్ దాటిన తర్వాత మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న ఉరవకొండ అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. వాహనానికి సంబంధించిన వారు ఇంతవరకు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. టోల్‌గేట్ వద్దనున్న సీసీ ఫుటేజీని పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు.

శ్రీరామిరెడ్డి కార్మికుల వినూత్న నిరసన


వినూత్న రీతిలో సమ్మె చేస్తున్న కార్మికులు

బెళుగుప్ప, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలంటూ మండలకేంద్రంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారానికి 11వ రోజుకు చేరింది. ఇందులో స్థానిక పంప్‌హౌస్ వద్ద కార్మికులు అర్ధనగ్నంగా ,ఆకులు తింటూ వినూత్న నిరసన తెలిపారు. పలువురు మాట్లాడుతూ తాము సమ్మె చేపట్టి 11 రోజులైనా ప్రభుత్వం స్పందించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. కార్మికులు అక్కులప్ప, మహేష్, సిద్దప్ప, శంకరయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలి

● ఆర్డీఓల సమావేశంలో కలెక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల్ని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆయా అధికారులకు సూచించారు. పట్టణంలోని శ్రీ శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో గల సమావేశం మందిరంలో బుధవారం ఆర్డీఓల సమావేశంలో జరిగింది. కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి వచ్చిన పీజీఆర్ఎస్ అర్జీలలో భూతగాదాలు, రస్తా వివాదాలు, ఇంటి స్థలాల సమస్యలు ఉన్నాయని, వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే డివిజన్‌లో రెవెన్యూ సిబ్బందికి ప్రజాసమస్యల పరిష్కారంలో ఎదురయ్యే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్వో మాలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, మల్లికార్జున, గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్, సర్వే ఏడీ రూప్లానాయక్, కలెక్టర్ సూపరింటెండెంట్‌లు యుగేశ్వరిదేవి, వసంతలత, రియాజుద్దీన్, పీజీఆర్ఎస్ తహసీల్దార్ వాణిశ్రీ, డివిజన్ మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్ఎలు, విలేజ్ సర్వేయర్లు తదితరులుపాల్గొన్నారు. అనంతరం మండలంలోని నక్కనదొడ్డి తండాకు చెందిన మునే నాయక్ ఇటీవల అనంతపురంలో జరిగిన ప్రజా సమస్య పరిష్కార వేదికలో భూసమస్యపై అర్జీని ఇచ్చారు. క్షేత్రస్థాయిలో ఆ సమస్యను పరిశీలించేందుకు ఆ గ్రామానికి కలెక్టర్ వెళ్లారు. భూసమస్యపై మునేనాయక్‌తో మాట్లాడారు. దానిని వెంటనే పరిష్కరించాలని ఆర్డీఓకు సూచించారు.

భవన నిర్మాణానికి భూమిపూజ


భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కళాశాల భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బుధవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాతగుంతకల్లులో నారాయణ విద్యా సంస్థ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడానికి నిర్ణయించడం సంతోషకర విషయమన్నారు. ఈ కళాశాలకు భవనాన్ని నిర్మిస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్‌కు అభినందనలు తెలిపారు. టీడీపీ నాయకులు గుమ్మనూరు జయరాం, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, ప్రతాప్ నాయుడు, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున, పత్తి హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

అరటి లారీ పోలీస్ స్టేషన్‌కు తరలింపు

● ధర్నా చేసిన రైతులు

పుట్లూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అరటికాయల లోడుతో వెళ్తున్న లారీ అధిక టన్నేజీ ఉందని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆగ్రహించిన రైతులు పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. వివరాల్లోకి వెళితే మడ్డిపల్లి గ్రామంలో బుధవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. ఇందులో అరటిలోడుతో వెళుతున్న లారీ ఎక్కువ టన్నేజీ ఉందని గుర్తించారు. దీంతో జరిమానా వేయకుండా ఏకంగా లారీని మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో లారీలో అరటికాయలు ఉన్న రైతు కేశవరెడ్డితో పాటు మరో 10మంది రైతులు స్టేషన్ వద్దకు వచ్చి ధర్నా చేశారు. పచ్చి సరుకు ఎవరైనా స్టేషన్‌కు తీసుకొస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటల తరబడి పెడితే సరుకు దెబ్బతింటుందని, నష్టం వస్తే డబ్బు మీరు చెల్లిస్తారా అంటూ ప్రశ్నించారు. తనకేమి తెలియదని సీఐ సార్ ఫైన్ వేశారని, ఆయన చెబితేనే స్టేషన్‌లో పెట్టామని ఎస్ఐ వెంకటనరసింహం తెలిపారు. అనంతరం రూ.12 వేలు జరిమానా విధించి విడిచిపెట్టారు.

వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లింల ర్యాలీ


ర్యాలీ చేస్తున్న ముస్లింలు

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ పట్టణంలో ముస్లింలు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ టీ సర్కిల్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు సాగింది. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ముస్లింలు నినాదాలు చేశారు. నియోజకవర్గంలో ఉన్న 56 మసీదుల ముతవల్లీలు, కమిటీ సభ్యులు కలిసి ర్యాలీ చేపట్టారు. తర్వాత పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రంను ఆర్డీవో కార్యాలయ ఏవో ఈశ్వరమ్మకు అందజేశారు.

డంపింగ్ యార్డు పరిశీలన

యాడికి, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో డంపింగ్‌యార్డును గుంతకల్లు డీఎల్‌డీఓ విజయలక్ష్మి బుధవారం సందర్శించి అక్కడి చెత్త నిల్వలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డుకు వచ్చిన వ్యర్థపదార్థాలను ఏమి చేస్తున్నారని పంచాయతీ కార్యదర్శిని ఆరాతీశారు. చెత్త నుంచి సంపద తయారుచేసేలా తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. డంపింగ్‌యార్డు ప్రాంగణంలో మొక్కల పెంపకాన్ని విరివిగా చేపట్టాలని గ్రామ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. తర్వాత ఆమె గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాల్సిందేనని తెలిపారు. ఆమె వెంట ఎంపీడీఓ వీరరాజు, పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్ ఉన్నారు.

బ్యాంకుకు తాళం వేసి నిరసన

శెట్టూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులు రైతుల ఆర్థిక స్థితిగతులకు అనుగుణంగా పంటరుణాల రెన్యూవల్ చేపట్టాలని మండలంలోని ములకలేడుకు చెందిన పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామంలోని యూనియన్ బ్యాంకు వద్ద బుధవారం వారు స్థానిక రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. బ్యాంకుకు తాళాలు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రైతుల పంట రుణాలను రెన్యూవల్ చేసుకునేందుకు వడ్డీతోపాటు అసలు చెల్లించాలని బ్యాంకర్లు కోరుతున్నారని, అయితే ప్రస్తుతం రైతుల ఆర్థిక పరిస్థితులు బాగాలేవని, కావున వడ్డీ మాత్రం కట్టించుకుని రుణాలు రెన్యూవల్ చేయాలని కోరారు. అయితే అందుకు బ్యాంకు అధికారులు ఒప్పుకోకపోవడంతో బ్యాంకుకు తాళాలు వేసి ధర్నా చేసినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

తాడిపత్రి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం ఇంజనీరింగ్ కార్మికులు ధర్నా నిర్వహించారు. వారికి సీఐటీయూ నాయకులు రామాంజనేయులు, నరసింహారెడ్డి మద్దతిచ్చి మాట్లాడారు. జీవో నెంబరు 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రంను కమిషనర్‌కు అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

యాడికి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ వీరరాజు తెలిపారు. మండలానికి 27యూనిట్లు రుణాలు మంజూరయ్యాయని చెప్పారు. రాయలచెరువు పరిధిలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ పరిధిలో 3యూనిట్లు, ఎస్‌బీఐ పరిధిలో 7 యూనిట్లు, యాడికిలోని ఎస్‌బీఐ పరిధిలో 5యూనిట్లు, కెనరా బ్యాంక్ పరిధిలో 7 యూనిట్లు, చీమలవాగుపల్లి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ పరిధిలో 2యూనిట్లు, తాడిపత్రి యూనియన్‌బ్యాంక్ పరిధిలో 3యూనిట్ల రుణాలు మంజూరయ్యాయని అన్నారు. అర్హులైన వారు మే10లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అధికారుల పనితీరు బాగోలేదు

● మండలసమావేశంలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం


శెట్టూరులో సబ్‌సెంటర్ల పనితీరుపై వైద్యాధికారిని నిలదీస్తున్న ఎంపీటీసీ సభ్యుడు లింగప్ప

శెట్టూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారుల పనితీరు ఏమీ బాగోలేదని పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో పలు శాఖల అధికారుల పనితీరుపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత ములకలేడు ఎంపీటీసీ సభ్యుడు లింగప్ప మాట్లాడుతూ.. వైద్య శాఖ సబ్ సెంటర్ల పనితీరు అధ్వానంగా ఉందని మండిపడ్డారు. తర్వాత శెట్టూరు సర్పంచ్ కుమార్ మాట్లాడుతూ వెలుగు, ట్రాన్స్‌కో ఉపాధి హామీ అధికారుల పనితీరు సైతం అధ్వానంగా వుందని తెలిపారు. అదేవిధంగా ఎంపీడీఓ తమ ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీఓ రఘురామారావు, తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముగ్గురు సభ్యులతోనే సమావేశం నిర్వహణ

యలనూరు: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గంగాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని ముగ్గురు సభ్యులతోనే నిర్వహించారు. మండలంలో మొత్తం పది మంది ఎంపీటీసీ సభ్యులుండగా కేవలం ముగ్గురు మాత్రమే సభకు హాజరుకావడం గమనార్హం. ముగ్గురు సభ్యులతోనే ఎంపీడీఓ వాసుదేవరెడ్డి సమావేశం నిర్వహించారు. కాగా సమావేశానికి హాజరైన ఎంపీటీసీ సభ్యులంతా వైసీపీ మద్ధతుదారులు కావడంతో వారు చెప్పినదానికి అధికారులు తల ఊపారు. ఇదిలా ఉండగా సమావేశానికి సభ్యులు కాని వ్యక్తులు సైతం వచ్చారు. సర్వసభ్య సమావేశానికి బయటవ్యక్తులను అధికారులు ఎలా అనుమతించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సభలో సభ్యులు సరిగా రాకపోవడంతో నిండుగా జనం కనిపించాలన్న ఉద్దేశంతోనే బయటవారిని కూర్చోబెట్టారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రధానశాఖల అధికారులు గైర్హాజరైనప్పటికీ వారితరపున కిందిస్థాయి సిబ్బంది హాజరై తమశాఖల్లోని పథకాలను వివరించారు.

సజావుగా మండల సమావేశం

కళ్యాణదుర్గంరూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ఎంపీపీ మారుతమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రజాప్రతినిధులు పలు గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వైస్ ఎంపీపీ కాంతమ్మ, ఎంపీడీఓ రామచంద్ర, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

21న వంటావార్పు

తాడిపత్రి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులను తీరును వ్యతిరేకిస్తూ.. పుట్లూరు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఈ నెల 21వ తేదీన వంటావార్పుతో నిరసన చేపట్టనున్నట్లు పట్టణంలోని టీడీపీ నాయకులు బుధవారం ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పుట్లూరు మండలంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించారని, దీనిపై పలుమార్లు కలెక్టర్, ఆర్డీఓకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని వాపోయారు. దీంతో నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించారని, ఈ క్రమంలో చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయని, గత ఐదునెలలు గడుస్తున్నా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. అనంతపురం ఆర్డీఓ, పుట్లూరు తహసీల్దార్ నిర్లక్ష్య వైఖరే ఇందుకు కారణమన్నారు. వారి తీరును వ్యతిరేకిస్తూ.. ఈనెల 21న పుట్లూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట వంటావార్పు నిర్వహించనున్నట్లు చెప్పారు. పుట్లూరు, యల్లనూరు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

పుట్లూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ కాత్యాయిని సూచించారు. మండలంలోని అరకటవేముల గ్రామంలో భూసార పరీక్షలు చేయించుకున్న రైతులకు బుధవారం ఆమె సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయిస్తే.. అందుకు అనుగుణంగా ఎరువులు వేసుకోవచ్చన్నారు. ఫలితంగా పంటల సాగుకు పెట్టుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. ఏఈఓ హరి తదితరులు పాల్గొన్నారు.

గుత్తి ఆర్ఎస్‌లో చోరీ

గుత్తి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్ఎస్‌లోని తోళ్లషాపు కాలనీకి చెందిన గోవిందు అనే వ్యక్తి ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కుటుంబ సమేతంగా తమ బంధువుల ఊరికి వెళ్లామని, గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడి బీరువాను పగలగొట్టారని, అందులో ఉన్న రూ. 20వేల నగదు, తులం బంగారు నగలు అపహరించుకెళ్లారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

గుత్తి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనంతపురం రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానిక తురకపల్లి రోడ్డు కాలనీకి చెందిన లక్ష్మయ్య పామిడికి ఆటోలో బయలుదేరాడు. అనంతపురం రోడ్డులో స్పీడ్ బ్రేకర్ వద్ద డ్రైవర్ షడెన్ బ్రేక్ వేయడంతో కుదుపునకు వెనక కూర్చున్న లక్ష్మయ్య కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే తోటిప్రయాణికులు అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పంది దాడిలో మహిళకు..

విడపనకల్లు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం పంది దాడి చేయటంతో మహిళ తీవ్రంగా గాయపడింది. లక్ష్మమ్మ అనే మహిళ ఇంటిలో చెత్తను పక్కనే ఉన్న దిబ్బలో వేసేందుకు వెళ్లింది. చెత్తను పడేస్తున్న సమయంలో దిబ్బలో ఉన్న పంది ఒక్కసారిగా ఆమెపై దాడి చేసింది. తప్పించుకునేందుకు ప్రయత్నించినా వదలకుండా చేతులను కాళ్లను కొరికి తీవ్రంగా గాయ పరిచింది. మహిళ కేకలు విన్న స్థానికులు పంది నుంచి మహిళను కాపాడి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం ఉరవకొండ ఆసుపత్రికి తరలించారు. గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో పందుల బెడద ఎక్కువగా ఉందని పంచాయతీ అధికారులు నియంత్రించాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీయాదవ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.3900 కోట్లు ఉండగా ప్రభుత్వం కేవలం రూ.1300కోట్లు మాత్రమే విడుదల చేసిందన్నారు. ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయన్నారు. కనుక వెంటనే ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు సగరనారప్ప, నాయకులు మని, గణేష్, జయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాఫిర్యాదుల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం

● ప్రజాదర్బార్‌లో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు


ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న విప్ కాలవ

కణేకల్లు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలకే తొలి ప్రాధాన్యత ఇచ్చి వాటిని త్వరిత గతిన పరిష్కరించే దిశగా ముందుకెళుతున్నామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయన ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ జరిగింది. ఇందులో పలు గ్రామాల ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. 125 వరకు వినతులు రాగా వాటిని కాలవ స్వీకరించి పరిశీలించారు. అందులో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా వాటిని ఆయా శాఖలకు అప్పగించి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజాసమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యతనిస్తున్నామని అన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. నేరుగా ప్రజాప్రతినిధే ప్రజల వద్దకు వచ్చి సమస్యలపై వినతులు స్వీకరించడం పట్ల ప్రజలు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ చంద్రమౌళి, ఈఓ ప్రసాద్, ఎంఈఓలు లక్ష్మణ్ణ, భవానీశంకర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

అధిక మార్కులు సాధించిన విద్యార్థినికి ప్రశంసలు

గుంతకల్లు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఇంటర్ బైపీసీలో రాష్ట్రంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని షబనాజ్‌ను పట్టణంలోని శస్త్ర కళాశాల యాజమాన్యం ప్రశంసలందజేసింది. కళాశాలలో బుధవారం ఉదయం పేరెంట్స్ మీటింగ్‌ను నిర్వహించారు. తమ కళాశాలలో చదివిన షబనాజ్ 993 మార్కులు సాధించడం గర్వంగా ఉందన్నారు. ఎంట్రెన్స్ పరీక్షలోనూ మంచి ర్యాంకు సాధించాలని సూచించారు. కళాశాల కరెస్పాండెంటు చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ వెంకట రమణ, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం

బొమ్మనహాళ్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంతకల్లు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవాన్ని ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓలు వీరన్న, మల్లికార్జున ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం పలువురు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముక్కన్న, టీడీపీ నాయకుడు సప్తగిరి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

విడపనకల్లు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కర్రెప్ప అనే రైతుకి చెందిన గడ్డి వామి బుధవారం తెల్లవారు జామున దగ్ధమైంది. వామికి నిప్పంటుకోవడాన్ని గమనించిన స్థానికులు వెంటనే ఉరవకొండ అగ్ని మాపక సిబ్బందికి ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. ఫైర్‌ఇంజన్ ఆలస్యంగా రావడంతో అప్పటికే వామి పూర్తిగా కాలి బూడిదైంది. ప్రమాదంతో 1.50లక్షల విలువ చేసే గ్రాసం కాలిపోయిందని, గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వల్లే ఇలా జరిగిందని బాధిత రైతు వాపోయారు. ఆ రైతును ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక టీడీపీ నాయకులు కోరారు.

బీడీ కార్మికులకు ఇళ్లస్థలాలు కేటాయించాలి

తాడిపత్రి, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీడీ కార్మికులకు ఇళ్లస్థలాలు కేటాయించి ఇళ్లను నిర్మించి ఇవ్వాలని ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ ఓబులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు చేపట్టిన ధర్నాకు ఓబులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణంలో వేలాదిమంది కార్మికులు బీడీ పరిశ్రమను నమ్ముకొని జీవనం సాగిస్తున్నారన్నారు. వారికి స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఇళ్లస్థలాల కోసం పలుమార్లు దరఖాస్తు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్‌చేశారు. అనంతరం కార్మికులతో కలిసి తహసీల్దార్ రజాక్‌వలికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు జగన్‌మోహన్‌రెడ్డి, సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు రామాంజనేయులు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్, పలువురు బీడీ కార్మికులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

గుత్తి,ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయ కమిషనరేట్ గుంటూరు ఏడీఏ రమణమూర్తి, స్థానిక ఏడీఏ వెంకటరాముడు, ఏఓలు సుకుమార్, ముస్తాక్ అహ్మద్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖరీఫ్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో నకిలీ పత్తివిత్తనాలు అరికట్టి, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలనే ఉద్దేశంతో దుకాణాల తనిఖీ చేపట్టామన్నారు. అదే విధంగా ఇండస్ట్రీయల్ ఏరియాలో ఉన్న పవన్ ఆగ్రో ఏజెన్సీ విత్తన ప్రాసెసింగ్ యూనిట్‌ను తనిఖీ చేశారు. జిల్లా వ్యవసాయ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ రాకేష్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం డంప్‌పై కేసు నమోదు

యాడికి, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): రాయలచెరువులో అరటితోటల మధ్యలో రేషన్ బియ్యం డంప్ చేసిన సంఘటనపై ముగ్గురిపై బుధవారం కేసు నమోదుచేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. మండలంలోని రాయలచెరువు గ్రామ సమీపాన అరటితోటల మధ్య రేషన్ బియ్యం డంప్ చేశారనే సమాచారంతో తమ సిబ్బంది రెవెన్యూ అధికారులతో కలిసి దాడిచేసినట్లు చెప్పారు. డంప్‌చేసిన 8.5టన్నుల బియ్యం సీజ్‌చేశామని తెలిపారు. సివిల్‌సప్లయిస్ అధికారుల ఫిర్యాదు మేరకు రేషన్ బియ్యం డంప్ చేసిన సుంకన్న, శోభన్‌బాబుతోపాటు డంప్ ఉన్న భూమి యజమాని నరసింహులుపై కేసు నమోదుచేసినట్లు పేర్కొన్నారు.

నూతన పింఛన్లను వెంటనే మంజూరు చేయాలి

● సీఎంకు శాసన మండలి ప్రివిలైజ్ కమిటీ చైర్మన్ లేఖ

ఉరవకొండ, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా.. ఇప్పటి వరకూ కొత్త సామాజిక భద్రతా పింఛన్లను ఒక్కటి కూడా మంజూరు చేయకపోవడం దారుణమని శాసన మండలి ప్రివిలైజ్ కమిటీ చైర్మన్ శివరామిరెడ్డి పేర్కొన్నారు. నూతన పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు లేఖ రాసినట్లు బుధవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో లక్షలాది మంది పేదలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం పేదలకు న్యాయం చేయాలని కోరారు.

అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభ్యం


విద్యార్థిని తండ్రికి అప్పగిస్తున్న ఎస్ఐ

తాడిపత్రి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన నాగవర్ధన్‌రెడ్డిని పట్టణ పోలీసులు బుధవారం తండ్రి చిన్నపుల్లారెడ్డికి అప్పజెప్పారు. ఈ సందర్భంగా ఎస్ఐ గౌస్‌బాషా మాట్లాడుతూ మూడు రోజులక్రితం బోడాయిపల్లి గ్రామానికి చెందిన నాగవర్ధన్‌రెడ్డి ఇంటర్ ఫలితాలు చూసుకొని వస్తానని తాడిపత్రికి వచ్చాడు. తర్వాత తిరిగి ఇంటికి వెళ్లకపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ తెలీలేదు. దీంతో అతడి తండ్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. పోలీసులు కేసు నమోదుచేసుకొని విద్యార్థి కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో అతడి ఫొటో అన్ని పోలీస్‌స్టేషన్‌లకు పంపించారు. తిరుపతిలో రైలుదిగి వెళుతుంటే అక్కడి పోలీసులు గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే వెళ్లి ఆ విద్యార్థిని తాడిపత్రికి తీసుకొచ్చి తండ్రి చిన్నపుల్లారెడ్డికి అప్పగించారు.